క్లుప్తంగా

ఉపాధి పనుల పరిశీలన



కొండచాకరాపల్లిలో పనులను పరిశీలిస్తున్న ఏపీఓ సత్యవతి

వంగర: మండలంలోని కొండచాకరాపల్లి, గీత నాపల్లి గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పనులను ఏపీఓ మర్రాపు సత్యవతి బుధవారం పరిశీలించారు.ఈసందర్భంగా వేతనదారులతో ఆమె మాట్లాడుతూ ఉపాధి సిబ్బంది సూచించిన కొలతల ప్రకారం పనులు చేస్తే ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ట వేతనం అందుతుందని చెప్పారు. రెండు పూటలా పనులకు హాజరు కావాలన్నారు. పని ప్రదేశంలో ప్రథమ చికిత్స కిట్లు, తాగునీరు అందుబాటులో ఉంచాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు



డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్న పోలీసులు

వంగర: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలో ఎస్‌ఐ షేక్‌శంకర్, పోలీస్ సిబ్బంది బుధవారం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. వాహన చోదకులను బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ద్విచక్రవాహన చోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. హెచ్‌సీ పిల్లా సన్యాసినాయుడు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి



ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలిరూరల్: టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా పక్కి గ్రామంలోని ఆయన విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు బుధవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ శంబంగి లక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు వేణుగోపాలనాయుడు పాల్గొన్నారు.

జనరేటర్‌కు మరమ్మతులు



సీహెచ్‌సీలో వినియోగంలోకి వచ్చిన జనరేటర్



బాడంగి: స్థానిక సీహెచ్‌సీలో మూలకుచేరిన జనరేటర్‌ను అధికారులు వినియోగంలోకి తీసుకువచ్చారు. జనరేటర్ పనిచేయకపోవడం వల్ల విద్యుత్ కోతల సమయంలో ఆస్పత్రిలో వైద్య సిబ్బంది, రోగులు పడుతున్న సమస్యలపై ఈ నెల 24న సాక్షిలో 'ఆస్పత్రిలో విద్యుత్ ఇక్కట్లు' శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి ఉన్నతాధికారులతో పాటు ఆస్పత్రి వైద్యాధికారి నాగేశ్వరరావు స్పందించారు. విజయవాడ నుంచి టెక్నీషియన్లను రప్పించి జనరేటర్‌ను మంగళవారం బాగుచేయించారు.

ఆధార్ అనుసంధానం తప్పనిసరి



మాట్లాడుతున్న తహసీల్దార్ సులోచనరాణి

రామభద్రపురం: రాష్ట్ర ప్రభుత్వం త్వరలో అమలు చేయనున్న అన్నదాత సుఖీభవ పథకం వర్తించాలంటే రైతులు తప్పనిసరిగా తమ భూముల వన్‌బీ ఖాతాలకు ఆధార్ నంబర్ అనుసంధానం చేసుకోవాలని తహసీల్దార్ ఏ. సులోచనరాణి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. భూముల ఖాతాలకు ఆధార్ అనుసంధానం కాని రైతులంతా తమ పరిధిలోని గ్రామ సచివాలయానికి వెళ్లి ఆధార్ అనుసంధానం చేసుకోవాలన్నారు.వన్‌బీ ఖాతాకు ఆధార్ లింక్ అయి ఉంటేనే అన్నదాత సుఖీభవ పథకం వర్తిస్తుందని చెప్పారు. డీటీ గంగాధరరావు పాల్గొన్నారు.

విత్తనాల గొడౌన్ పరిశీలన

బొండపల్లి: నెలివాడలో గల ఏపీ సీడ్స్ వరి విత్తనాల గొడౌన్‌ను వ్యవసాయ శాఖ గజపతినగరం సబ్ డివిజన్ ఏడీఏ కె.మహారాజన్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గొడౌన్‌లోని ఐదు చోట్ల శాంపిల్స్ సేకరించారు. వీటిని పరీక్ష నిమిత్తం ల్యాబ్‌కు పంపించనున్నట్లు ఏడీఏ తెలిపారు. రైతుల నుంచి సేకరించిన విత్తనాలకు అన్ని పరీక్షలు నిర్వహించామని అధికారులు ఏడీఏ దృష్టికి తీసుకువచ్చారు.

- రసాయనాల వినియోగంతో మామిడి పండ్ల మగ్గింపు
- ఆరోగ్యానికి హానికరం అంటున్న వైద్యులు
- కాయలను మగ్గించేందుకు ఎన్‌డ్రైప్ ప్యాకెట్స్ వినియోగిస్తే మేలంటున్న ఉద్యాన శాఖాధికారులు
- ఏఎంసీలో నిరూపయంగా ఉన్న రైఫినింగ్ ఛాంబర్

మెరిసేవన్నీ పండ్లు కావు..!



రామభద్రపురం అంతర్రాష్ట్ర మార్కెట్లో విక్రయిస్తున్న మామిడి

బొబ్బిలి:

ఈ చిత్రాలు చూశారా? నియోజకవర్గ కేంద్రంలోని బొబ్బిలి పెద్ద బజారు, అంతర్రాష్ట్ర కూడలి రామభద్ర పురం మార్కెట్లలో విక్రయిస్తున్న మామిడి పండ్లు. బాగా పండి నిగనిగలాడే రంగుతో కంటికి ఇంపుగా కనిపిస్తూ నోరూరిస్తున్నాయి కదూ... కానీ మెరిసేదంతా బంగారం కాదన్న సామెత మాదిరిగానే నిగనిగలాడేవి, ఎర్రగా కనిపించేవన్నీ పండ్లు కాదని ఆహార ప్రియులు గుర్తిస్తే మంచిది. వేసవి వచ్చిందంటే చాలు ఆహార ప్రియులకు ముందుగా గుర్తుకు వచ్చేవి పండ్లలో రారాజు మామిడి పండ్లే.ఏడాదికి ఒకసారి లభించే మధుర ఫలమని ధర ఎక్కువైనా మామిడి పండ్లు కొనేందుకు ఎగబడుతుంటారు. కానీ ఈ పండ్లు సాధారణ, సంప్రదాయ పద్ధతిలో పండించడం ఇప్పుడు కానరావడం లేదు. ఇప్పుడంతా ఈ రోజు మామిడి చెట్ల నుంచి కాయలు దించితే రేపటికల్లా పండేయాలి, వెంటనే మార్కెట్‌కు తరలించేయాలి. ఇందుకోసం కాల్షియం కార్బైడ్, ఇథలిన్ వంటి రసాయనాలతో మగ్గించి ఎర్రగా మారిన తర్వాత మార్కెట్‌లోకి దించుతున్నారు. ఎంత బాగున్నాయో అంటూ కొనుగోలు దారులు వాటినే ఇళ్లకు తీసుకెళ్లి తింటూ అనారోగ్యం బారిన పడుతున్నారు. రసాయనాలు స్ప్రేచేసి మగ్గించిన మామిడి పండ్లను తినడం వల్ల దీర్ఘకాలంలో కాన్సర్, తదితర ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశముందని వైద్యులు తరచూ హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అయినా వీటిపై పర్యవేక్షణ కరువైందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

11,200 హెక్టార్లలో మామిడి సాగు

బొబ్బిలి నియోజకవర్గంలో 11,200 హెక్టార్లలో మామిడి తోటలు సాగులో ఉన్నాయి. ఈ పంటను జిల్లాలోని అవసరాలకు మాత్రమే కాకుండా ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు కూడా ఎగుమతి చేస్తుంటారు.



బొబ్బిలి మార్కెట్‌లో విక్రయిస్తున్న మామిడి పండ్లు

బొబ్బిలి, రామభద్రపురం, ఎస్.కోట, కొత్తవలస, విజయనగరం ప్రాంతాల నుంచి మామిడి ఇతర రాష్ట్రాలకు కూడా ఎగుమతి అవుతుంటాయి. ముఖ్యంగా భువనేశ్వర్, కలకత్తా ప్రాంతాలకు మన మామిడి ఏటా వేల క్వింటాళ్లు ఎగుమతి అవుతోంది. కొంత మంది కాయలు కావాలని వాటినే కోరడంతో కాయలు ఎగుమతి చేస్తున్నా రు.కాయలైతో రవాణాలో పాడవకుండా ఉంటాయి. అదే పండ్లయితే రవాణాలోనే ఎక్కువ శాతం రద్దవుతాయి. ఇతర ప్రాంతాలకు రవాణా చేసి మామిడి కాయలను రసాయనాలతో మగ్గించకపోయినప్పటికీ, స్థానికంగా విక్రయించే వాటిని మాత్రం రసాయనాలతోనే మగ్గిస్తు న్నారని పలువురు అంటున్నారు.

గతంలో ఉన్నంత ఇప్పుడు లేదు

గతంలో కాల్షియం కార్బైడ్, ఇథలిన్ వంటి రసాయనాలతో మామిడి కాయలను పండించేవారు. ఇప్పుడు కాల్షియం కార్బైడ్ లభించదు. అలాగే ఇథలిన్ కూడా వినియోగించడం లేదు. ప్రభుత్వ గుర్తింపు ఉన్న ఎన్‌డ్రైప్ ప్యాకెట్స్‌తోనే మగ్గిస్తున్నారు. వాటినే రైతులు సబ్సిడీపై విక్రయించాలని కోరుతున్నారు. పరిశీలిస్తున్నాం.

– మోహన కృష్ణ, వెంకటరత్నం, ఉద్యానవన శాఖాధికారులు

జిల్లాలో మామిడి సాగు:	30,720 హెక్టార్లు
బొబ్బిలి నియోజకవర్గంలో	11,200 హెక్టార్లు
స్థానిక మార్కెట్లు:	45
అంతర్రాష్ట్ర మార్కెట్లు:	4

ఎన్‌డ్రైప్ ప్యాకెట్స్ వినియోగించాలి

మామిడి పండ్లను మగ్గించేందుకు ఎన్‌డ్రైప్ ప్యాకెట్స్‌ను వినియోగించాలని ఉద్యాన శాఖాధికారులు చెబుతున్నారు. వీటిని ప్రభుత్వ పరంగా తనిఖీలు చేసి అనుమతులు ఇస్తున్నారని, వీటిని వినియోగించి మగ్గించే పండ్లను తిన్నా ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తవని అంటున్నారు.ఎంత పరిమాణంలో కావాలంటే అదే పరిమాణంలో వినియోగించుకునే అవకాశం ఉన్న ఎన్ డ్రైప్ ప్యాకెట్స్‌ను సబ్సిడీపై ఇస్తే బాగుండునని మామిడి రైతులు భావిస్తున్నారు.

మూలపడ్డ రైఫినింగ్ ఛాంబర్

బొబ్బిలి ఏఎంసీ యార్డులో గతంలో నిర్మించిన రైఫినింగ్ ఛాంబర్ మూలపడి ఏళ్లు గడుస్తోంది. దీనిని వినియోగంలోకితెస్తే మామిడి పండ్లను సహజసిద్ధంగా మగ్గించవచ్చని, బొబ్బిలికి చెందిన మామిడి రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. కానీ ఈ ఛాంబర్‌ను వినియోగించేందుకు అవకాశం లేక పోవడంతో అసాధారణ పద్ధతుల్లోనే మామిడి కాయలను రైతులు మగ్గిస్తున్నారు. వాటినే మార్కెట్లో వినియోగిస్తున్నారు.వివిధ మార్కెట్ అవకాశాలున్నప్పటికీ ఏఎంసీ అధికారులు, సిబ్బంది మామిడి పంట విక్రయాలను పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి.



బొబ్బిలి ఏఎంసీలో నిరూపయోగంగా ఉన్న రైఫినింగ్ ఛాంబర్

అభినందన

రేగిడి: మండలంలోని ఉంగరాడమెట్ట సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాల/కళాశాలలో పదోతరగతి, ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, ఆపాఠశాల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావును కలెక్టర్ బీఆర్ అంబేద్కర్, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు అభినందించారు. జిల్లాలోని సోషల్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో పని చేస్తున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులాల్లో పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, ఆ పాఠశాలల ప్రిన్సిపాళ్లను జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో బుధవారం సత్కరించారు. పాఠశాలలో పదో తరగతిలోఉత్తమ ఫలితాలు సాధించిన అలికాన సాయిచరణ్, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన లాస రాజేష్‌తో పాటు ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావుకు కలెక్టర్ జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ గురుకులాల కో–ఆర్డినేటర్ రూపవతి పాల్గొన్నారు.



ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావుకు జ్ఞాపిక అందజేస్తున్న కలెక్టర్ అంబేద్కర్

30న మోడల్ పరీక్ష

విజయనగరం గంటస్తంభం: స్థానిక గురజాడ గ్రంథాలయం కేంద్రంగా ఈ నెల 30న డీఎస్సీ మోడల్ పరీక్షను నిర్వహించనున్నామని డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ హరీష్ తెలిపారు. బుధవారం ఎల్బీజీ భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్‌జీటీ అభ్యర్థులకు మాత్రమే పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ప్రశ్నపత్రాన్ని విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు తయారు చేస్తున్నారని పేర్కొన్నారు. రూ.50 ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 8019273486, 7095956895 నంబర్లను సంప్రదించాలన్నారు. ఆయనతో పాటు ఉపాధ్యక్షుడు సతీష్ ఉన్నారు.

నిత్య జీవితంలో యోగా భాగం కావాలి

యోగా చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని, ప్రతీ ఒక్కరి నిత్య జీవితంలో యోగా ఓ భాగం కావాలని ఆర్డీఓ జి.వి.వి.ఎస్.రామ్మోహనరావు అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా బొబ్బిలి మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల ఉద్యోగులకు రెండో రోజు బుధవారం యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులను ఆర్డీఓ పరిశీలించడంతో పాటు వారి తో కలిసి ఆసనాలు వేశారు. అలాగే బాడంగి, వంగర, రాజాం మండల పరిషత్ కార్యాలయాల్లో, రేగి డి మండలంలోని ఉంగరాటమెట్ట గురుకుల పాఠశాలలో బుధవారం సచివాలయ, అంగన్‌వాడీ, విద్య, వెలుగు శాఖలకు చెందిన సిబ్బందికి యోగా శిక్షణ తరగతులు కొనసాగాయి. – సాక్షి నెట్‌వర్క్



బొబ్బిలిరూరల్: ఎంపీడీఓ కార్యాలయంలో ఉద్యోగులతో కలిసి యోగా చేస్తున్న ఆర్డీఓ రామ్మోహనరావు



రేగిడి: ఉంగరాడమెట్ట గురుకుల పాఠశాలలో ఆసనాలు వేస్తున్న ఉద్యోగులు



బాడంగి: ఎంపీడీఓ కార్యాలయంలో యోగా చేస్తున్న వివిధ శాఖల సిబ్బంది



వంగర: ఎంపీడీఓ కార్యాలయంలో యోగా చేస్తున్న ఎంపీడీఓ రఘునాథాచారి, వివిధ శాఖల సిబ్బంది



రాజాం సిటీ: ఎంపీడీఓ కార్యాలయంలో యోగా చేస్తున్న ఉద్యోగులు

కౌలు రైతుల గుర్తింపునకు గ్రామసభలు



బాడంగి: రేజేరులో మాట్లాడుతున్న ఏఓ శిరీష



రేగిడి: ఉణుకూరులో మాట్లాడుతున్న ఏఓ మురళీకృష్ణ

కౌలు రైతులను గుర్తించి, వారికి సీసీఆర్‌సీలు (పంట సాగుదారు హక్కు పత్రాలు) అందించేందుకు వ్యవసాయశాఖ అధికారులు బుధవారం గ్రామసభలు నిర్వహించారు. వంగర మండల కేంద్రంలో ఏఓ తట్టికోట కన్నబాబు, రేగిడి మండలంలోని మునకల వలస, పారంపేట, ఉణుకూరు, అంబాడ గ్రామాల్లో ఏఓ జి.మురళీకృష్ణ, బాడంగి మండలం లోని రేజేరు, ఆనవరం, డొంకినవలస, తెంటువలస గ్రామాల్లో ఏఓ కె.శిరీష ఆధ్వర్యంలో ఈ సభలు జరిగాయి. ఎకరా నికి తక్కువ కాకుండా అదే గ్రామంలో కౌలు చేసిన రైతులకు 11 నెలల కాలపరిమితితో సీసీఆర్‌సీలు ఇవ్వనున్నట్లు ఏఓలు చెప్పారు. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, ఆయా గ్రామాల పెద్దలు పాల్గొన్నారు. – వంగర/రేగిడి/బాడంగి

ప్రజల్లో చైతన్యం కలిగించడమే ధ్యేయం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జేవీవీ సభ్యులు

రాజాం సిటీ: శాస్త్రీయ దృక్పథాలను ప్రోత్సహించడం, ప్రజల్లో మూఢ నమ్మకాలను పారద్రోలి చైతన్యం కలిగించడమే జన విజ్ఞాన వేదిక(జేవీవీ) ధ్యేయమని ఆ సంస్థ రాష్ట్ర కార్యదర్శి రాజగోపాల్ అన్నారు. స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో బుధవారం జన విజ్ఞాన వేదిక రాజాం డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేవీవీలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. త్వరలో విజయనగరం కేంద్రంలో జేవీవీ రాష్ట్రమహాసభలు నిర్వహించనున్నామని చెప్పారు. పాఠశాల స్థాయిలో సైన్స్ ఎగ్జిబిషన్లు, అక్షరాస్యత, కూల్ డ్రింక్‌లపై వ్యతిరేక ప్రచారం, ఆరోగ్య సూత్రాలపై ప్రచారం, పర్యావరణం, రైతు అంశాలపై జేవీవీ ప్రజల్లో చైతన్యం తీసుకువస్తోందని పేర్కొన్నారు. అనంతరం జేవీవీ కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. జేవీవీ జిల్లా అధ్యక్షుడు రమణప్రభాత, సభ్యులు జె.నీలయ్య, వెంకటనాయుడు, గౌరీ శంకరరావు, సత్యనారాయణ, రెడ్డి మోహనరావు, బొత్స బుద్ధుడు, పెంకి చైతన్య, ఉల్లాకుల నీలకంఠేశ్వరయాదవ్, గణపతిరావు, డాక్టర్ ఆల్తి మోహనరావు, ఆర్.వి.జె.నాయుడు, రమేష్, భరత్, జగదీష్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ అప్పయ్య

రామభద్రపురం: ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ డీఈ పి.అప్పయ్య సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్ ఏఈ వెంకటేష్‌తో కలిసి ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ దశల్లో నిలిచిన నిర్మాణాలను పూర్తి చేయించి జూన్ 12వ తేదీ లోగా గృహప్రవేశాలు చేయించాలని సూచించారు. ఎస్సీ,ఎస్టీ,బీసీ లబ్ధిదారులకు గతంలో మంజూరైన నిధులకు అదనంగా నిధులు ఇస్తున్నట్లు తెలిపారు. పీఎంఏవైయూ పథకం కింద మంజూరైన ఇళ్లను డిసెంబర్‌లోగా పూర్తి చేయాలని లేకుంటే రద్దవుతాయన్నారు. నియోజకవర్గంలో సొంత స్థలాలు, లేఅవుట్లలో మొత్తం 1,888 ఇళ్లు మంజూరు కాగా ఇప్పటి వరకు 595 పూర్తయ్యాయన్నారు. ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ కొత్తగా 1,973 మంది దరఖాస్తు చేసుకున్నారని, రెవెన్యూ అధికారుల నుంచి పొజిషన్ సర్టిఫికెట్ ఉంటే మంజూరు చేస్తామని చెప్పారు.

ఇంటి పన్ను పెంపు సరికాదు



మాట్లాడుతున్న శంకరరావు, తదితరులు

బొబ్బిలి: ఇంటి పన్ను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతుండడం సరికాదని సీపీఎం బొబ్బిలి పట్టణ అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు అన్నారు. పట్టణంలోని సీపీఎం కార్యాల యంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది కాకముందే రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి ప్రజలపై విద్యుత్ ఛార్జీల రూపంలో రూ. 15,485 కోట్లు బాదారని, దీన్ని జనం మర్చిపోకముందే ఇప్పుడు రూ.1,500 కోట్ల మేర ఆస్తిపన్నుల రూపంలో భారం మోపేందుకు సిద్ధమవుతుండడం దారుణమన్నారు. ఏప్రిల్ నుంచి పెంచాలనుకుంటున్న పన్నుల శాతం 15కు మించి ఉండ బోతోందని, ఇది పేద,మధ్యతరగతి ప్రజలకు ఎంతో కష్టంతో కూడుకున్నదన్నారు. అనధికార కట్టడాల పేరుతో పేద, మధ్యతరగతి ఇళ్లపై 25 నుంచి 100 శాతం వరకు వసూళ్లకు రంగం సిద్ధ మైందని, ఇప్పటికే సర్వేలు చేపట్టారన్నారు.సంక్షేమ పథకాలు అమలుచేయడం పక్కన పెట్టి తిరిగి పేదలపై పన్నుల వడ్డింపా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పెంచిన పన్నులు వసూలు చేయడంలో కమిషనర్లదే బాధ్యత అని మున్సిపల్ శాఖామంత్రి హుకుం జారీ చేయడం ఏంటని నిలదీశారు. ఈ పన్నుల పెంపును సీపీఎం తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. ప్రజలపై భారాలు ఉండవని హామీ ఇచ్చి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం ఇంటి పన్నుల పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. త్వరలోనే పట్టణ ప్రజలతో కలిసి ఈ పన్నుల పెంపును వ్యతిరేకిస్తూ ర్యాలీలు, నిరసనలు చేపడతామని చెప్పారు. సీపీఎం మండల కన్వీనర్ ఎస్.గోపాలం, నాయకులు జి.శంకరరావు, రామలక్ష్మి పాల్గొన్నారు.

దీర్ఘకాలిక వ్యాధులకు ఆయుర్వేద వైద్యం



వృద్ధుడికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ తానీషా సుబ్బారాయుడు

రామభద్రపురం: దీర్ఘకాలికంగా వ్యాధులతో బాధపడుతున్న వారికి ఆయుర్వేద వైద్యమే అన్ని విధాలా మేలని ఆయుర్వేద వైద్యాధికారి బి.తానీషా సుబ్బారాయుడు అన్నారు. ఆయన స్థానిక ఆయుర్వేద ఆస్పత్రికి పశ్చిమగోదావరి జిల్లా నుంచి ఇటీవల బదిలీపై వచ్చారు. ఆస్పత్రిలో బుధవారం పలు వురు రోగులకు వైద్యపరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో వాతవ నొప్పులు, చర్మవ్యాధులు, పైల్స్, దగ్గు, జలుబు తదితర రోగాలకు అవసరమైన ఆయుర్వేద మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఏ విధమైన సైడ్ ఎఫెక్ట్స్ లేని ఆయుర్వేద మందులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ముగిసిన అసిరితల్లి పండగ

రాజాం: మండలంలోని నందబలగ గ్రామంలో వారం రోజులు పాటు నిర్వహించిన అసిరితల్లి అమ్మవారి పండగ బుధవారం అనుపోత్సవంతో ముగిసింది. మంగళవారం సాయంత్రం సిరి మానోత్సవం నిర్వహించగా, అర్ధరాత్రి వరకు గ్రామస్తులు అమ్మవారికి ముర్రాటలు, పసుపు,కుంకుమ,చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.వినోద, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. చుట్టుపక్క గ్రామాలకు చెందిన బంధువులు, స్నేహితులతో బుధవారం గ్రామం మొత్తం కిటకిటలాడింది. ప్రధాన రహదారిలో గ్రామానికి అరకిలోమీటరు దూరంలో వాహనాలను పోలీసులు నిలిపివేశారు.

విందులో పాల్గొన్న ఎమ్మెల్సీ

నందబలగ గ్రామంలో అసిరితల్లి పండగ సందర్భంగా ఆ గ్రామ సర్పంచ్ కొర్ను ఈశ్వరరావు, మాజీ సర్పంచ్ బింగి సూర్యనారాయణ, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు బుధవారం ఏర్పాటు చేసిన విందు భోజనాల కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఆ పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ హాజరయ్యారు.



సిరిమానోత్సవంలో భక్తులు

కాకాణి అరెస్టు అప్రజాస్వామికం

నందబలగలో ఎమ్మెల్సీ విక్రాంత్, వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతోందని ఆరోపించారు. చట్టవిరుద్ధంగా కేసులు నమోదుచేసి, అప్రజాస్వామికంగా అరెస్టులు చేస్తోందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ప్రజా స్వామ్యాన్ని కూటమి ప్రభుత్వం ఖూనీచేస్తోందని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, రాజాం జెడ్పీటీసీ బండి నర్సింహులు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, సర్పంచ్‌లు నక్క శ్రీను, వంజరాపు విజయ్‌కుమార్, మాజీ సర్పంచ్ ముదిలి జనార్దనరావు, వంగర మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కరణం సుదర్శనరావు, తదితరులు పాల్గొన్నారు.



సర్పంచ్ నివాసం వద్ద విందుకు హాజరైన ఎమ్మెల్సీ విక్రాంత్, డాక్టర్ రాజేష్ తదితరులు

- గోతులతో అధ్వానంగా తయారైన రోడ్లు
- చినుకుపడితే చిత్తడే
- గుంతల్లో నిలిచిపోతున్న వర్షపు నీరు
- వాహన చోదకులకు తప్పని ఇక్కట్లు



గుంతల్లో వర్షపునీటితో చెరువులా కనిపిస్తున్న పి.జె.పేట-రంగారాయపురం రోడ్డు

సంతకవిటి: మండలంలోని పలుగ్రామాల రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఎక్కడికక్కడే గోతులు తేలడంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించేందుకు వాహన చోదకులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. చిన్న వర్షం కురిస్తే చాలు..రోడ్లపై గోతుల్లో నీరు నిలిచిపోయి చెరువులను తలపిస్తున్నాయి. మండలంలోని రాజాం-సంతకవిటి ప్రధాన రహదారిలో తాలాడ, గుళ్లసీతారాంపురం, గరికిపాడు గ్రామాల వద్ద పెద్ద పెద్దగోతులు తేలాయి. అలాగే గోవిందపురం, కె.ఆర్.పురం రహదారులు, పి.జె.పేట-రంగరాయపురం రోడ్లలో అడుగుకో గుంత దర్శనమిస్తోంది. గోతుల వల్ల తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని, నిత్యం నరకం చూస్తున్నామని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. రెండురోజులుగా కురిసిన కొద్దిపాటి వర్షాలకే ఈ రోడ్లు చిత్తడిచిత్తడిగా మారాయని, ఇక వర్షాకాలంలో మరింత దారుణంగా తయారవుతాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.అధికారులు స్పందించి వర్షాకాలం ప్రారంభం కాకముందే మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.



తాలాడ వద్ద గుంతల్లో చేరిన నీటితో అధ్వానంగా ఉన్న రాజాం-సంతకవిటి ప్రధాన రహదారి



సంతకవిటి: కె.ఆర్.పురం రహదారిలో ఎం.ఆర్.అగ్రహారం గ్రామ వద్ద దమ్ము మడిని తలపిస్తున్న రోడ్డు